14,15లలో ఫిస్టులాకాన్ జాతీయ సదస్సు

సుల్తాన్ బజార్, జూన్ 12 : ఉస్మానియా మెడికల్ కళాశాలలో ఫిస్టులాకాన్ 2025 పేరిట జూన్ 14, 15 లలో రెండు రోజుల పాటు జాతీయ సదస్సు, ప్రత్యక్ష శస్త్రచికిత్స శిబిరాన్ని జనరల్ సర్జరీ విభాగం, అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా – తెలంగాణతో కలిసి నిర్వహిస్తున్నట్లు ఉస్మానియా జనరల్ సర్జరీ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ పల్లం ప్రవీన్, చీఫ్ పాట్రన్ డాక్టర్ డి. మోహన్ దాస్, పాట్రాన్ డాక్టర్ ఉమాకాంత్ గౌడ్ లు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ జాతీయ సదస్సు లో నిపుణుల ఉపన్యాసాలు, ప్యానల్ చర్చలు, ప్రత్యక్ష శస్త్రచికిత్సల ప్రదర్శనలు నిర్వహించబడుతాయని వివరించారు.ఈ సదస్సును తెలంగాణ వైద్య విద్యా సంచాలకులు డాక్టర్ నరేంద్ర కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభిస్తారని అన్నారు. ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రాజా రావు, ఉస్మానియా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రాకేశ్‌లు పాల్గొంటారని వివరించారు.

ఇద్దరు విద్యార్థులు అదృశ్యం

నజ్రకాటూన్(ఫైల్) సాకిబ్ (ఫైల్)

కాచిగూడ జూన్ 12: కాచిగూడ నెహ్రూనగర్ లోని మదర్సా నుంచి ఇద్దరు విద్యార్థులు అదృశ్యమైన ఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ నరేశ్ వివరాల ప్రకారం గోల్నాక డివిజన్ నెహ్రూ నగర్ లోని మదర్సాలో బీబీరేషన్ కుమారుడు ఎండీ సాకిబ్, మరో విద్యార్థి నజ్ర కాటూన్ చదువుకుంటున్నారు. ఈనెల 10 నుంచి మదర్సాలో విద్యార్థులు కనిపించక పోవడంతో చుట్టు పక్కల వెతికిన ఆచూకీ లభించకపోవడంతో ప్రిన్సిపాల్ తౌహీద్ ఖాన్ బుధవారం రాత్రి కాచిగూడ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేశ్ తెలిపారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

పాఠశాలల పున:ప్రారంభంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

గోల్నాక, జూన్ 12: ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. గురువారం పాఠశాలల పున:ప్రారంభం సందర్భంగా గోల్నాక డివిజన్, తులసీరాంనగర్ లంక ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై... విద్యార్థులకు యూనిఫామ్‌లతో పాటు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి వారి ఉజ్వల భవిష్యత్‌కు సహకరించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడా మౌలిక వసతి సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందని, తరగతి గదులతోపాటు క్వాలిఫైడ్ ఉపాధ్యాయులున్నారని, ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లలను చేర్పిస్తే భవిష్యత్‌లో మంచి ప్రయోజకులు అవుతారన్నారు. గత సంవత్సరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేసి తనవంతు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో అస్రా ఫాతిమా, స్కూల్ ప్రధానోపాధ్యాయులు వెంకట్ రెడ్డి, ఉపాధ్యాయుడు గణేశ్, ఐ ఫోకస్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



లంక ప్రభుత్వ పాఠశాలలో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట డివిజన్‌లో ..

అంబర్‌పేట డివిజన్ సీపీఎల్ బాయ్స్ హై స్కూల్‌తోపాటు సీపీఎల్ లకోటియా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్థానిక కార్పొరేటర్ విజయ్‌కుమార్ యూనిఫామ్‌లతో పాటు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన అనంతరం కేసీఆర్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో అనేక మార్పులు చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ బాయ్స్ హై స్కూల్ ప్రిన్సిపాల్ మహేశ్వర్, లకోటియా పాఠశాల ప్రిన్సిపాల్ సుశీలమ్మ, బీఆర్ఎస్ నాయకులు మహేశ్ ముదిరాజ్, షేక్ రఫిక్, సాయి, సంతోష్ చారి, వినయ్ తదితరులు పాల్గొన్నారు

సీపీఎల్ హైస్కూల్లో పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్ గౌడ్

విద్యార్థులు చదువులో రాణించాలి..



నోట్ బుక్స్ పంపిణీ చేస్తున్న కాచిగూడ కార్పొరేటర్ ఉమా రమేశ్‌యాదవ్

కాచిగూడ, జూన్ 12: విద్యార్థులు చదువులో రాణించినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని కాచిగూడ కార్పొరేటర్ ఉమా రమేశ్ యాదవ్ అన్నారు. గురువారం కాచిగూడ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పేద విద్యార్థులకు స్కూల్ డ్రెస్సులు, నోట్ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ .. నేటి విద్యార్థులను రేపటి పౌరులుగా తీర్చిదిద్దవలసిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, సుభాశ్ పటేల్, అరవింద్, లావణ్య, వాసు, భీమ్రాజ్, సంతోశ్, రవి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు

పాఠశాల పునః ప్రారంభ సమావేశంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

చార్మినార్, జూన్ 12: తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి అన్నారు. గురువారం గౌలిపురా నుంచి లలితాబాగ్ రోడ్డులోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల శాలిబండలో వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునః ప్రారంభం అయిన సందర్భంగా విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాంలు అందజేశారు. ముఖ్య అతిథిగా ఆమె హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవడానికి చదువు ఎంతో తోడ్పడుతుందని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరి నారాయణ, అమ్మ ఆదర్శ పాఠశాలల అధ్యక్షులు శిరీష, అనురుద్ద రావు, మధుసూదనరావు, డాక్టర్ విజయ భాస్కర్, సంధ్య, అంజలి, మంజుల, శ్రీదేవి, ప్రమీల, నవనీత, పాఠశాల జూనియర్ అసిస్టెంట్‌లు అనిల్‌కుమార్, సుధేష్ణపాల్గొన్నారు.

పాఠశాలలు పునఃప్రారంభం

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేత

సత్యానగర్ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న కార్పొరేటర్ అమృత

అంబర్‌పేట, జూన్ 12 : వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు గురువారం పునః ప్రారంభమయ్యాయి. అంబర్‌పేట నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో గల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలన్నీ తెరుచుకున్నాయి. ఈ సందర్భంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలను అందంగా అలంకరించారు. కొన్నిచోట్ల మామిడి తోరణాలు కట్టి పువ్వులతో అందంగా తీర్చిదిద్దారు. ప్రజాప్రతినిధులు ఆయా డివిజన్‌లలో గల ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు ప్రభుత్వ పాఠ్య, నోటు పుస్తకాలు అందజేశారు. నల్లకుంట డివిజన్ కార్పొరేటర్ అమృత డివిజన్‌లోని సత్యానగర్ ప్రభుత్వ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. అలాగే బాగ్‌అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి డివిజన్‌లోని బతుకమ్మకుంటలో గల ప్రభుత్వ గోషామహల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు అందించారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో అమ్మబాట-బడిబాట కార్యక్రమాలు నిర్వహించారు. మొదటి రోజు చిన్నారులకు ఎగ్ బిర్యాని వండి తినిపించారు.

రహమత్‌నగర్ అంగన్‌వాడీ సెంటర్‌లో అమ్మబాట-బడిబాటలో చిన్నారులు

బాగ్‌అంబర్‌పేటలోని బతుకమ్మకుంట ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి, తదితరులు

కులవృత్తుల వారు ఉత్తమ సేవలు అందించాలి

మెహిదీపట్నం జూన్ 12 : గోల్కొండ కోటలో జరిగే బోనాల ఉత్సవాల సందర్భంగా కులవృత్తులవారు ప్రజలకు, భక్తులకు ఉత్తమ సేవలు అందించాలని గోల్కొండ జగదాంబిక ఎల్లమ్మ ఆలయ సలహాదారు, సంఘ సేవకులు సిరుగుమల్లె రాజు వస్తాద్ అన్నారు. గురువారం గోల్కొండ కోటలో బోనాల కుల వృత్తుల సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాజు వస్తాద్ మాట్లాడుతూ ..నెలరోజులపాటు జరిగే ఆషాఢమాసం బోనాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఏసీపీ సయ్యద్ ఫయాజ్, సంఘం ముఖ్య సలహాదారులు, రాజు వస్తాద్ , ఈఓ వసంత , ఆలయ చైర్మన్ చంటి బాబు, సలహాదారు అర్. నర్సింగ్ రావు, బి. సాయి బాబా చారి, కె శంకర్, వృత్తి పనివారి అధ్యక్షుడు తంగడపల్లి శివశంకర్, ఉపాధ్యక్షులు శ్రీకాంత్ చారి, జి.సుధీర్, ఆర్. డప్పు రవి, బాబు రావు, వృత్తి పనివారి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఎంఎన్‌జే క్యాన్సర్ దవాఖాన ఆవరణలో రోగి సహాయకులకు అన్నదానం చేస్తున్న టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేనీ

క్యాన్సర్ దవాఖానలో అన్నదానం..

సుల్తాన్‌బజార్, జూన్ 12 : అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని ఆధ్వర్యంలో గురువారం ఎంఎన్‌జే క్యాన్సర్ దవాఖాన ఆవరణలో సుమారు 800 మంది పేద రోగుల సహాయకులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి టీఎన్జీవో వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఖాజామియా ముఖ్య అతిథిగా విచ్చేసి టీఎన్జీవో కేంద్ర సంఘ అసోసియేట్ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ గౌడ్, క్రీడా కార్యదర్శి బోలిగిద్ద శంకర్, హైదరాబాద్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కె.ఆర్.రాజ్ కుమార్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కుర్రాడి శ్రీనివాస్, కార్యనిర్వాహక కమిటీ సభ్యుడు ముకీమ్ ఖురేషి, టీఎన్జీవో క్యాన్సర్ హాస్పిటల్ యూనిట్ అధ్యక్షుడు శివకుమార్, కార్యదర్శి చంద్రశేఖర్, హైదరాబాద్ జిల్లా ఏపీఆర్ఓ మహ్మద్ వహీద్, మహ్మద్ ముస్తఫా షరీఫ్, మహ్మద్ హబీబ్ చావుష్, మిత్రులు నికమ్ నివాస్, మరాఠా సంఘం ఉపాధ్యక్షుడు, ఉస్మాన్ అలీ ఉస్మాని, రామకృష్ణారెడ్డి తదితరులతో కలిసి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం డా.ముజీబ్ హుస్సేనీ మాట్లాడుతూ.. కీర్తిశేషులైన తన తల్లిదండ్రుల పేరుమీద వివిధ కార్యక్రమాలు చేస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. తన కుటుంబ సభ్యులు, స్నేహితులు, తోటి ప్రభుత్వ ఉద్యోగుల సహకారంతో అనేక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించినందుకు భగవంతునికి సదా రుణపడి ఉంటానని తెలిపారు.

యోగాపై అవగాహన

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం గోల్కొండ కుమ్మర్‌వాడిలో యోగ గాపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యోగా శిక్షకురాలు పుష్పలత, మెడికల్ ఆఫీసర్, డాక్టర్ హుస్నా అర, డాక్టర్ అయేషా, సిబ్బంది పాల్గొన్నారు.
– మెహిదీపట్నం

సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.20 లక్షలు

మెహిదీపట్నం, జూన్ 12: ప్రజల శాంతిభద్రతల కోసం సీసీ కెమెరాల పాత్ర ఎంతో కీలకమని కార్వాన్ ఎమ్మెల్యే మహమ్మద్ కౌసర్ మొయినుద్దీన్ అన్నారు. టోలీచౌకి పోలీస్ స్టేషన్ పరిధిలోని హకీంపేట్, పారా మౌంట్ కాలనీ, టోలీచౌకి తదితర ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు కార్వాన్ ఎమ్మెల్యే మహమ్మద్ కౌసర్ మోయినుద్దీన్ రూ.20 లక్షల నిధులు కేటాయిస్తున్నానని పోలీసులకు తెలిపారు. గురువారం టోలీచౌకి ఏసీబీ సయ్యద్ ఫయాజ్, ఇన్‌స్పెక్టర్ రమేశ్ నాయక్‌లు ఎమ్మెల్యేను కలిసి శాంతిభద్రతలపై చర్చించారు. ఈ సందర్భంగా ఏసీపీ సయ్యద్ ఫయాజ్ సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతిపాదించగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. సమావేశంలో అదనపు ఇన్‌స్పెక్టర్ బాలరాజ్, ఎస్సై సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ రౌడీషీటర్ హత్య కుట్ర భగ్నం

ఆరుగురు అరెస్ట్.. పరారీలో మరో ఇద్దరు

చాంద్రాయణగుట్ట, జూన్ 12 : మాజీ రౌడీషీటర్ హత్య కుట్రను దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్‌తో కలిసి బండ్లగూడ పోలీసులు భగ్నం చేశారు. ముఠాలోని ఆరుగురిని పోలీసులు పట్టుకోగా మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ అందె శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. రాజేంద్రనగర్ కు చెందిన మాజీ రౌడీషీటర్ ముర్తుజాను పాత కక్షల నేపథ్యంలో హత్య చేయడానికి పహాడీషరీఫ్‌లో నివసించే రాజేంద్రనగర్ రౌడీషీటర్ మహమ్మద్ జాబేర్ (43) పథకం పన్నాడు. ఇందుకోసం జమీర్ ఖాన్ (30), బండ్లగూడ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్ సయ్యద్ షా అబ్దుల్ జబ్బార్ అలియాస్ సులేమాన్(22), మహమ్మద్ రహ్మత్ అలియాస్ సోను (28), సయ్యద్ షా అబ్దుల్ మన్నాన్ అలియాస్ సల్మాన్ (31), మహమ్మద్ నాసిర్(33), మాసీన్, అజహర్‌లతో కలిసి హత్యకు పథకం పన్నాడు. రౌడీ షీటర్ మహమ్మద్ జాబెర్.. ముర్తుజాతో కలిసి పనిచేసేవాడు. ఈ క్రమంలో వీరిద్దరి మధ్య బేధాప్రాయాలు ఏర్పడ్డాయి. 2019లో ఒకసారి జాబెర్ షాబాద్ పోలీ స్ స్టేషన్ పరిధిలో ముర్తుజా అలీ హత్య కు కుట్ర పన్నిన కేసులో జైలుకెళ్లి వచ్చా డు. అయినా తీరు మార్చుకోలేదు. 2022లో బహదూర్‌పుర పోలీస్ స్టేషన్ పరిధిలో హత్య కేసులో జాబేర్ జైలుకు వెళ్లాడు. జైలు నుంచి వచ్చిన తర్వాత అతడు తన అసాంఘిక కార్యకలాపాల ను కొనసాగిస్తూనే ఉన్నాడు. ఇప్పుడు తిరిగి ముర్తుజా అలీ హత్యకు కుట్ర ప న్నాడు. దీనిపై సమాచారం అందడంతో దక్షిణ మండలం టాస్క్ ఫోర్స్ పోలీసులు బండ్లగూడ పోలీసులతో కలిసి గురువా రం జాబేర్‌తోపాటు మరో ఐదుగురిని పట్టుకున్నారు. మోసిన్, అజర్లు పరారీలో ఉన్నారు. నిందితుల వద్ద నుంచి 12 కత్తులతో పాటు ఐదు సెల్ ఫోన్లు , కారును స్వాధీనం చేసుకున్నారు .

ప్రజా సమస్యలు పరిష్కరించరా..

గోషామహల్ బీఆర్ఎస్ నేత ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్, జూన్ 12 : బేగంబజార్ డివిజన్, అజీజ్ ప్లాజా మార్కెట్ వద్ద గతవారం రోజులుగా డ్రైనేజీ పొంగిపొర్లుతూ ప్రధాన రోడ్డు అధ్వానంగా మారినా ప్రజా ప్రతినిధులుగానీ అధికారులు గానీ పట్టించుకోవడంలేదని గోషామహల్ బీఆర్ఎస్ నేత ఎం.ఆనంద్ కుమార్ గౌడ్ ఆరోపించారు. ఈ మేరకు బస్సులో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత వారం రోజులుగా బేగంబజార్ డివిజన్ పరిధిలోని అజీజ్ ప్లాజా మార్కెట్ రోడ్డులో డ్రైనేజీ లీకేజీ కారణంగా మురుగునీరు ప్రవహిస్తూ ఆ ప్రాంతమంతా దుర్గంధమయంగా మారింద న్నారు. మురుగునీరు, దుర్వాసనలు పీల్చి అనారోగ్యం పాలవుతున్నామని స్థానిక వ్యాపారులు వాపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయమై ఓ వ్యాపారి స్థానిక ఎమ్మెల్యే రాజాసింగ్‌కు ఫోన్‌చేసి డ్రైనేజీ నిండిపోయి దుర్వాసనలు వెదజల్లుతూ మార్కెట్ మార్గమంతా మురుగునీటి తో అధ్వాన్నంగా మారి నడవలేని పరిస్థితి నెలకొందని ఫిర్యాదు చేయగా, మీరు కార్పొరేటర్లకు ఫోన్ చేయాలని చెప్పి ఎమ్మెల్యే చేతులు దులుపుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సంబంధిత కార్పొరేటర్లకు ఫిర్యాదు చేసేందుకు వ్యాపారులు ఫోన్ చేస్తే వారు ఫోన్ కూడా ఎత్తడంలేదని అన్నారు. సదరు వ్యాపారి ఈ విషయాన్ని తన దృష్టికి తీసుకురావడంతో నిమిషాల వ్యవధిలో అక్కడికి చేరుకొని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వెంటనే సమస్య పరిష్కరించాలని కోరారు.

ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నేత ఆనంద్‌కుమార్ గౌడ్

సీజ్ చేయడానికి వస్తే.. వెనక్కి పంపించారు

మెహిదీపట్నం, జూన్ 12: కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన ఫిర్యాదుతో బీఆర్ఎస్ నాయకుడి భవనాన్ని సీజ్ చేయడానికి వచ్చిన జీహెచ్ఎంసీ అధికారులను నాంపల్లి ఎమ్మెల్యే మహమ్మద్ మజీద్ హుస్సేన్ తిరిగి పంపించారు. నాంపల్లి నియోజకవర్గంలోని విజయనగర్ కాలనీ డివిజన్‌లో ఉండే బీఆర్ఎస్ అధ్యక్షుడు అభిషేక్ భవనం కట్టుకుంటున్నాడు. అయితే అనుమతులు లేకుండా భవనాన్ని నిర్మిస్తున్నాడంటూ కాంగ్రెస్ నాయకుడు ఫిరోజ్ ఖాన్ అనుచరులు జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా అభిషేక్‌ను రూ.30 లక్షలు ఇవ్వాలంటూ బ్లాక్‌మెయిల్ చేయడం మొదలుపెట్టారు. అతను డబ్బులు ఇవ్వను అని అనడంతో, కాంగ్రెస్ ప్రభుత్వం కావడంతో ఉన్నతాధికారులపై ఒత్తిడి తెచ్చి గురువారం భవనాన్ని సీజ్ చేయడానికి అధికారులను రప్పించారు. సమాచారం అందుకున్న నాంపల్లి ఎమ్మెల్యే అక్కడికి తరలివచ్చారు. స్థానికులు కాకుండా ఎక్కడి వారో ఫిర్యాదు చేస్తే అధికారులు సీజ్ చేయడానికి రావడం ఏంటంటూ ఆయన మండిపడ్డారు. సీజ్ చేయడానికి వీలు లేదంటూ అధికారులను వెనక్కు పంపించేశారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

అబిడ్స్, జూన్ 12: గన్‌ఫౌండ్రీ డివిజన్, నేతాజీ నగర్‌లో గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్.. గన్ ఫౌండ్రీ కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓంప్రకాశ్‌తో కలిసి అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం ఓంప్రకాష్ భీష్మతో కలిసి మురికినీటి కాలువ పనులను పర్యవేక్షించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ..ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. బస్తీల వారీగా ప్రజల సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ , సుదర్శన్, రాకేశ్, వివేకానంద, నిర్మల్, రంజిత్, శ్రీకాంత్, శైలేంద్ర, శ్యాంరావు, హరి, వెంకట్, రాజేశ్, రేఖ, రాజలక్ష్మి, పూజ, కేశవ్, గణేశ్‌యాదవ్, రమేశ్, రాజేశ్, కిశోర్, సాయి గౌడ్, సాయి, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి

చార్మినార్, జూన్ 12: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలంగాణ బాలల హక్కుల రక్షణ కమిషన్ చైర్మన్ సీతా దయాకర్ రెడ్డి తెలిపారు. గురువారం అంతర్జాతీయ బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని చార్మినార్ వద్ద ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చార్మినార్ వద్ద ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం రాష్ట్ర బాలల హక్కుల, ఆశ్రిత, ఉమెన్ డెవలప్‌మెంట్, చైల్డ్ వెల్ఫేర్, ఎస్సీపీసీఆర్‌ల సంయుక్త ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, టీజీఎస్‌పీసీఆర్ సభ్యులు కంచర్ల వందన గౌడ్, మర్రిపల్లి చందన, అపర్ణ, గోగుల సరిత, ప్రేమలత, అగర్వాల్, వచన్ కుమార్, ఉమెన్స్ సేఫ్టీ వింగ్ డీసీపీ లావణ్య, ఆశ్రిత డైరెక్టర్ నాగరాజు, మేనేజర్ పర్వతాలు, నాయకులు పులిపాటి రాజేశ్ కుమార్, వెంకటేశ్, రవిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

చార్మినార్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యులు

పలు రైళ్లలో చోరీలు..

కాచిగూడ, జూన్ 12: కాచిగూడ స్పెషల్ రైల్లో దొంగతనం జరిగింది. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప వివరాల ప్రకారం ..సికింద్రాబాద్‌లోని తిరుమలగిరి ప్రాంతానికి చెందిన హరి ప్రసాద్ భార్య కొటారి విజయ(62) కాచిగూడ స్పెషల్ రైల్లో కాచిగూడకు వస్తుండగా మార్గమధ్యలో గుర్తుతెలియని దుండగులు రూ.7 వేలు, రెండు సెల్‌ఫోన్లు, రిస్ట్ వాచ్, ఏటీఎం కార్డు, హెల్త్ కార్డు కలిగిన బ్యాగులు దొంగిలించారు. గురువారం కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని తదుపరి విచారణ నిమిత్తం నాందేడ్ రైల్వే పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.

మరో ఘటనలో....

మహారాష్ట్రలోని మల్కాపూర్ ప్రాంతానికి చెందిన గాయత్రి గజానంద్ కులకర్ణి నాచారంలో ప్రభుత్వ ఉద్యోగి. కాచిగూడ స్పెషల్ రైలులో కాచిగూడకు వస్తుండగా మార్గమధ్యలో గుర్తు తెలియని వ్యక్తులు ల్యాప్‌టాప్, ఫోన్‌ను దొంగిలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కాచిగూడ రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని తదుపరి విచారణ నిమిత్తం నాందేడ్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు తెలిపారు.

మరో ఘటనలో...

మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన కన్వర్ట్ సర్కార్ ప్రతిమ అజంతా రైల్లో కాచిగూడకు వస్తుండగా మార్గమధ్యలో గుర్తు తెలియని దుండగులు అతని బ్యాగులోంచి పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఎంఎస్సీ సర్టిఫికెట్లను దొంగిలించారు. బాధితుడు కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని తదుపరి విచారణ నిమిత్తం నిజామాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు కాచిగూడ రైల్వే సీఐ తెలిపారు.

బాలికపై లైంగిక దాడి నిందితుడికి జైలు

మెహిదీపట్నం జూన్ 12: బాలికపై లైంగిక దాడి చేసిన నిందితుడికి జైలు శిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పు ఇచ్చినట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటరాములు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. 2018లో నానల్ నగర్ ఖాదర్‌బాగ్ లో నివసించే ముస్తఫా హుస్సేన్ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. లంగర్ హౌస్ పోలీసులు నిందితుడిపై పోక్సో కేసును నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు పూర్వపరాలను పరిశీలించిన నాంపల్లి 12వ అడిషనల్ సెషన్స్ జడ్జి అనిత నిందితుడికి ఐదు సంవత్సరాల జైలు శిక్ష వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించారు. జరిమానా కట్టని పక్షంలో మూడు నెలల సాధారణ జైలు శిక్షను అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు.